Eenadu Dt-14/03/17

# మెట్రో రైలు: చకచకా పరుగులు

మెట్రోరైలు ప్రాజెక్టుకు 2017-18 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌లో ఆశించిన దాని కంటే ఎక్కువ నిధులే దక్కాయి. దాదాపు రూ.200 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు వచ్చే ఆర్థిక సంవత్సరం అత్యంత కీలకం. రాబోయే ఏడాది కాలంలో మెట్రో 66 కి.మీ. ప్రయాణికులకు అందుబాటులోకి రాబోతుంది. మొత్తం 72 కి.మీ.గాను పాతబస్తీ మినహాయిస్తే దశలవారీగా నాగోలు-హైటెక్‌సిటీ, మియాపూర్-ఎల్బీనగర్ వరకు ప్రయాణికులకు మెట్రో అందుబాటులోకి వస్తుంది. జేబీఎస్-ఇమ్లిబన్ వరకు కూడా పూర్తవుతుందని అధికారులు అంటున్నారు.

## పరిహారానికి సింహభాగం..

కారిడార్-2 సుల్తాన్‌బజార్‌లో సేకరించనున్న ఆస్తులకు పరిహారం, మరికొన్ని ప్రాంతాల్లో భూసేకరణకు పరిహారం ఇవ్వాలి. విస్తరించిన చోట మంచినీరు, విద్యుత్తులైన్ల తరలింపు, రహదారి అభివృద్ధి...ఇలా వీటన్నింటికి రూ.100 కోట్ల వరకు అవుతుందని అధికారులు అంటున్నారు. పాతబస్తీకి పచ్చజెండా ఊపితే అక్కడా ఆస్తులను సేకరించాల్సి ఉంటుంది.

## ఆకాశమార్గాలు

మెట్రో స్టేషన్ల నుంచి ప్రయాణికులు సౌకర్యవంతంగా వారు పనిచేసే కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, బహిరంగ ప్రదేశాలకు చేరుకునేందుకు ఆకాశమార్గాలను(స్కైవాక్స్) నిర్మించే ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిని పట్టాలెక్కించేందుకు కూడా నిధులు ఖర్చుచేస్తారు.. వీటికి రూ.30 కోట్ల వరకు అవుతుందని అంచనాలు ఉన్నాయి.

## సుందరీకరణ

ఉప్పల్ మెట్రో స్టేషన్ రహదారి మార్గంలో రూ.2 కోట్లు వెచ్చించి నిర్మించిన నమూనా తరహా మూడు కారిడార్లలో ప్రస్తుతం నిర్మిస్తున్న 59 స్టేషన్లలోనూ అభివృద్ధి చేయాల్సి ఉంది. బడ్జెట్ నిధులను వీటికి వెచ్చించనున్నారు.



"బడ్జెట్‌లో మెట్రోకి సముచిత నిధులే దక్కాయి. మెట్రో ప్రారంభంతో పాటే సిటీని సరికొత్తగా చూడాలనేది మంత్రి కేటీఆర్ ఆలోచన. అందుకు తగ్గట్టుగా స్టేషన్ల వద్ద వాహనాల కోసం బేల ఏర్పాటు, స్ట్రీట్ ఫర్నిచర్, ఆకాశమార్గాలతో అత్యున్నత స్థాయిలో తీర్చిదిద్దబో తున్నాం. మాకు కేటాయించిన నిధులతో ఆస్తుల సేకరణ, పరిహారం చెల్లింపుతో పాటు అనుసంధానం చేయాల్సిన వాటికి ఖర్చుచేస్తాం"

–ఎన్వీఎస్‌రెడ్డి, ఎండీ,
హైదరాబాద్ మెట్రోరైలు

